ఎంపీటీసీ స్థానాల తుది జాబితా ప్రకటన



మేడ్చల్: మండలంలోని పలు గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో నూతన ఎంపీటీసీ స్థానాల జాబితాను మండల పరిషత్ అధికారులు జనవరి 30న ప్రకటించారు. పునర్విభజన జాబితాపై అభ్యంతరాలు ఉంటే జనవరి 30, 31వ తేదీల్లోగా కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలపాలని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అట్టి జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో సోమవారం తుది జాబితాను ప్రకటించారు.

విజయగణపతి ఆలయ వార్షికోత్సవం

మల్కాజిగిరి: ఉప్పరిగూడలోని విజయగణపతి ఆలయం 20వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, గణపతిహోమం, భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, అమరేశ్వరరావు, ఉమేష్‌సింగ్, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కుషాయిగూడ: నల్ల పోచమ్మ దేవాలయాన్ని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన భాస్కర్‌రెడ్డి సోమవారం సీసీఎస్ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం అమ్మవారి దేవాలయంలో సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌ను సత్కరించారు. ఇన్‌స్పెక్టర్ సాయిలు, సీసీఎస్ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు రవిగుప్తా, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, రాంరెడ్డి, జనార్దన్, ఈశ్వరయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

మేడిపల్లి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కేశవనగర్ కాలనీలో వెంకటేష్ (45)భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా ఉప్పల్ మార్కెట్‌లో గత కొన్నేళ్ల నుంచి హోల్‌సేల్ కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. అప్పులు అధికమవడంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృత భాష అభ్యాసంపై వర్క్‌షాప్



అల్వాల్: ఉస్మానియా యూనివర్సిటీ సంస్కృత అకాడమీ, సాంస్కృతిక భాషా విభాగం సంయుక్తాధ్వర్యంలో సోమవారం సైనిక్‌పురి భవన్స్ కళాశాలలో 'సాంస్కృతిక శిక్షణ, అభ్యాసం ఎదురయ్యే సమస్యలు, సవాళ్లు' అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంస్కృత అకాడమీ డైరెక్టర్ ప్రొఫెసర్ మధుసూదన్ హాజరై మాట్లాడారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం : సీపీఎం

ఉప్పల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ సీపీఎం పార్టీ ఉప్పల్ సర్కిల్ అధ్వర్యంలో సోమవారం ఉప్పల్ రింగ్ రోడ్డులో నిరసన చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2025 బడ్జెట్‌లో తెలంగాణ ప్రాంతానికి నిధులు కేటాయించలేదని వారు దుయ్యబట్టారు. సర్కిల్ కార్యదర్శి వెంకన్న, ఎస్. నాగరాజు, ఉర్మిళ, ఉపేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆకర్షణీయం.. అనారోగ్యం !

- చూసేందుకు ఆకట్టుకున్న నకిలీ ఉత్పత్తులు
- అనారోగ్య సమస్యలు వస్తాయన్న నిపుణులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



మేడ్చల్ హోల్‌సెల్ షాపుల వద్ద..



కిరాణ దుకాణంలో అమ్మకానికి ఉంచిన స్నాక్స్ ప్యాకెట్లు

మేడ్చల్‌రూరల్ : స్నాక్స్ అంటే ఇష్టపడని పిల్లలు ఉండరు. ఫింగర్ స్టిక్స్, క్లిప్స్, రింగ్స్, క్రేజీబాల్, గిఫ్ట్ చాక్లెట్ ఇలా రకరకాల పేర్లతో అనేక తినుబండారాలు మార్కెట్లోకి వస్తున్నాయి. టీ స్టాల్ నుంచి కిరాణాషాపు, బేకరీ, ఫుట్‌పాత్ వ్యాపారుల వద్ద సైతం ఈ పదార్థాల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. రూపాయి నుంచి రూ.5, రూ.10 వరకు వివిధ పరిమాణాల్లో మార్కెట్‌లో లభిస్తున్నాయి.

స్కూల్‌కు వెళ్లేటప్పుడు చిన్నారుల మారాం..

స్కూల్‌కు వెళ్లే చిన్నారులు తమ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో వీటిని ఇలాంటి పదార్థాలను కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు చిన్నారులు వీటిని కొనిస్తేనే స్కూల్‌కు వెళ్తామని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు చేసేదేమీ లేక.. పిల్లలకు ఆ పదార్థాలు కొనిస్తున్నారు. కానీ వీటివల్ల వచ్చే అనారోగ్యాలను పసిగట్టాల్సిన బాధ్యత పెద్దలపైనే ఉంది.

హానికరమైన రసాయనాలు..

ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో లభించే స్నాక్స్ వంటి చిరు తిండ్లలో కొన్ని నాసిరకంగా ఉంటున్నాయి. అధిక మోతాదులో ఉప్పు, కారంతో పాటు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హానికరమైన రసాయనాలను వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే రోగాలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నాణ్యతకు తిలోదకాలు...

బ్రాండెడ్ కంపెనీలకు దగ్గరగా.. ఒకట్రెండు అక్షరాలు అటూ, ఇటూ చేసి కొన్ని కంపెనీలు మార్కెటింగ్ చేస్తున్నాయి. మేడ్చల్ పట్టణంలోని కొందరు వ్యాపారులు హోల్‌సెల్ దుకణాల ద్వారా స్నాక్స్ ప్యాకెట్లను పట్టణంతో పాటు మండలంలోని గ్రామాలు చిన్న దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. మరికొందరు చిరు వ్యాపారులు హోల్‌సెల్ దుకాణాల వద్ద కొనుగోలు చేసి తమ షాపుల్లో విక్రయిస్తున్నారు. అంతిమంగా ఇవి పిల్లల వద్దకు చేరుతున్నాయి.

నాసిరకం వైపే వ్యాపారుల మొగ్గు....

స్నాక్స్ అమ్మే వ్యాపారులు ఎక్కువగా నాసిరకంగా వాటిని అమ్మేందుకే మొగ్గు చూపుతున్నారు. బ్రాండెడ్ కంపెనీలు తయారు చేసే కంపెనీ పదార్థాలు అమ్మితే ఒక ప్యాకెట్‌పై రూ.50 పైసలు వస్తుందని, నాసిరకం వాటిపై అధికంగా లాభాలు వస్తుండటంతో నాసిరకం వైపే మొగ్గు చూపుతున్నారు.

చిన్నారులను స్నాక్స్‌కు దూరంగా ఉంచాలి

మార్కెట్లో లభించే స్నాక్స్, తినుబండారాలకు ప్రజలు దూరంగా ఉండాలి. ముఖ్యంగా చిన్నారులను వాటికి దూరంగా ఉంచాలి. నాణ్యత లేని ఆహార పదార్థాలు తినే చిన్నారుల సంఖ్యతో పాటు పెద్దల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. రుచి, నిల్వకోసం వీటిలో ఉపయోగించే రసాయనాలు, రంగులతో కడుపు నొప్పి, అజీర్తి వంటి సమస్యలతో పాటు భవిష్యత్తులో ఎసీడిటీ, జీర్ణకోశ, కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పిల్లలు, పెద్దలు జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ మోహన్, పీడియాట్రిషన్

తనిఖీలు శూన్యం..

మార్కెట్లో లభించే చిరు తినుబండారాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆహార తనిఖీ, తూనికలు, కొలతల అధికారులు ఎక్కడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. తనిఖీలు చేసినా.. పెద్ద మొత్తాల్లో ముడుపులు అందవు. కాబట్టే పర్యవేక్షణను గాలికొదిలేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. చిరుతిళ్లకు సంబంధించి పెద్దగా గిట్టుబాటు కావడం లేదని అధికారులు తనిఖీలకు వెళ్లడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని..

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఘనాపూర్ ఓ ప్రైవేటు కళాశాలలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపేయాలని కోరుతూ స్థానికులు మహేశ్వర్‌గౌడ్, కృష్ణారెడ్డి అనే వ్యక్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 1140, 1141లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిపై చట్టపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్‌గా వీర భాస్కర్‌రావు



నియామకపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీసెల్ చైర్మన్‌గా పసుపులేటి వీర భాస్కర్‌రావు నియమతులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నేతలు సోమవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గత 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేసినందుకు గుర్తించి పదవీబాధ్యతలు అప్పగించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరివర్ధర్‌రెడ్డి, నేతలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్యయాదవ్, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు రవిముదిరాజ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



ప్రత్యేక పూజల్లో చామకూర మహేందర్‌రెడ్డి, మాజీ మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని మదర్ థెరిస్సా కాలనీలో ముత్యాలమ్మ ఆలయ చైర్మన్ వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మేయర్ కావ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు నిహారికగౌడ్, వేణు, సాయి, జిట్టా శ్రీవాణి, మేక లలితాయాదవ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహంకాళి ఆలయ వార్షికోత్సవంలో గ్రామ పెద్దలు, భక్తులు

మహంకాళి ఆలయ వార్షికోత్సవం..

కీసర: రాంపల్లిలోని మహంకాళి దేవాలయంలో వార్షికోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకులు రామ్మూర్తి శర్మ, గణపురం రాంప్రసాద్ శర్మ, శ్యామ్‌సుందర్‌శర్మలచే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, గణపతిపూజ, పుణ్యాహవచనం చేశారు. పంచమి సందర్భంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ భూమయ్యయాదవ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వాహనాలతో పర్యావరణానికి మేలు



ప్రారంభిస్తున్న వజ్రేష్‌యాదవ్, పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ఎలక్ట్రానిక్ వాహనాలు పర్యావరణ హితమైనవని, వీటి వినియోగం వల్ల వాయుకాలుష్యం తగ్గుతుందని, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. సోమవారం ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనం షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ వాహనాల నిర్వహణ ఇతర వాహనాలతో పోలిస్తే తక్కువగా ఉంటుందని, ఈవీల చార్జింగ్ పెట్రోల్, డీజిల్ కంటే తక్కువ ధరకే లభిస్తుందన్నారు. ఎలక్ట్రానిక్ వాహనాల కొనుగోళ్లపై ప్రభుత్వం సబ్సీడీలు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణయాదవ్, ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యయాదవ్, ఆంజనేయులుయాదవ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, మాజీ సర్పంచులు వెంకటేష్‌ముదిరాజ్, రామలింగేశ్వర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రహీం, ఖయ్యూమ్, రాంచందర్‌యాదవ్, శంకర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులు !



మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రజల కంటే అధికంగా ప్రజా ప్రతినిధులు ఫిర్యాదులు చేస్తున్నారు. సామాన్య ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వస్తుంటారు. ఇక్కడి కార్పొరేటర్లు, ఎమ్మెల్యే పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి 2 ఫిర్యాదులు అందాయని, అధికారులు వివరించారు. ఇంజినీరింగ్ విభాగంలో పెండింగ్ పనులు, ఆస్తిపన్ను వివరాల్లో యజమానుల పేర్లు తప్పుగా నమోదు అవుతున్నాయని, ఓటరు నమోదులో రోహింగ్యాలు, ముస్లింల పేర్లు ఇక్కడ లేకున్నా నమోదు చేస్తున్నారని ఆరోపించారు. సఫిల్‌గూడ ట్యాంక్‌బండ్‌పై నూతన టాయిలెట్స్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని, కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు.

డివిజన్ సమస్యలపై సమీక్ష

అల్వాల్: వెంకటాపురం డివిజన్ సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం ప్రజావాణిలో జెడ్సీ అపూర్వ చౌహాన్‌ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చబొల్లారం డివిజన్‌లోని 7 జేఏసీ కాలనీలో డ్రైన్ ఔట్‌లెట్ సమస్య, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, అధికారుల నిర్లక్ష్యంతోనే భారీ అపార్టుమెంట్ల నుంచి ఏడు జేఏసీ కాలనీలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్రమ కట్టడాలపై తగిన చర్యలు తీసుకోవాలని, కొందరు అధికారులు ప్రోటోకాల్‌ను పాటించడం లేదని మండిపడ్డారు. దీనిపై త్వరలోనే అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలోనే అల్వాల్ సర్కిల్ పరిధిలో స్వయంగా పర్యటించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబిలఅనిల్‌కిషోర్‌గౌడ్, నాయకులు రమేష్, పరమేష్, లక్ష్మణ్‌యాదవ్, అనిల్‌కిషోర్, వెంకటేష్, జావేద్ యాదవ్, సందీప్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సతీష్, సురేష్, హనుమాన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా షేక్ జహంగీర్

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా షేక్ జహంగీర్ నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుపడు సైఫ్‌ఉద్దీన్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయడంతో పాటు పదవీబాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. షేక్ దిలావార్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు, వేల గొంతులు' పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మార్పీఎస్ నేతలు

కీసర: ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నిర్వహించనున్న 'లక్ష డప్పులు, వేల గొంతులు' వాల్‌పోస్టర్‌ను సోమవారం రాంపల్లిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి డప్పును భుజాన వేసుకుని తరలిరావాలని పిలుపునిచ్చారు. రాంపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బందెల పరమేష్, మీసాల భాస్కర్, నర్సింగరావు, రవి, మంచాల మహేందర్, బిక్షపతి, ఈశ్వర్, వెంకటేష్, బాబు, జగన్, రాములు, యాదగిరి, మల్లేష్, శ్రీనివాస్, స్వామి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారిణి డోలి కృష్ణవేణికి నివాళి

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారిణి డోలి కృష్ణవేణి సంతాప సభ బొల్లారంలోని ఉద్యమకారుల ఫోరం కార్యాలయంలో మల్కాజిగిరి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్యర్యంలో పుటాల కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ.. డోలి కృష్ణవేణి తెలంగాణ ఉద్యమంలో ఎన్నో సేవలు చేశారన్నారు. సురేందర్‌రెడ్డి, సంతోష్, శోభన్‌బాబు, చంద్రశేఖర్, ముత్యాలు, గోపాల్, సుధీర్, సుకుమార్, బాలనర్సింహ, జమ, విలియం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

- స్కూళ్లల్లో సామూహిక అక్షరాభ్యాసం



మేడ్చల్ న్యూ లిటిల్ లిల్లీ పాఠశాలలో..



అవుషాపూర్ సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో..

ఘట్‌కేసర్: అవుషాపూర్ సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సరస్వతిమాతకు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. స్కూల్ డైరెక్టర్ కిశోర్‌కుమార్, విజయ్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, శ్రవణ్, విద్యార్థిని, విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: మేడ్చల్, గుండ్ల పోచంపల్లి తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. పట్టణంలోని తుమ్మ చెరువుపై ఉన్న కట్టమైసమ్మ తల్లిని జ్ఞానసరస్వతి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. న్యూ లిటిల్ లిల్లీ హైస్కూల్‌లో సరస్వతిమాత హోమం, ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. పాఠశాల చైర్‌పర్సన్ మంజులప్రకాష్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



జలమండలి అధికారికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కీసర: ఎస్వీనగర్ రోడ్డునెంబర్ 4లో నూతనంగా నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ (ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్)ను ప్రారంభించాలని మాజీ కౌన్సిలర్ అనిత జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 7,8,9వ వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వహయాంలో మిషన్ భగీరథ ప్రాజెక్టులో భాగంగా ఎస్వీనగర్‌లో 7.5లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును నిర్మించారని, ఈ ట్యాంకును వెంటనే ప్రారంభించి, దీని నుంచి నీటి సరఫరా చేయాలని జలమండలి అధికారి శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించారు. వారం రోజుల్లో ట్యాంకును ప్రారంభించి నీటిసరఫరా ప్రారంభించనున్నట్లు అధికారి హామీ ఇచ్చారన్నారు. ఎస్వీనగర్ కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్‌లో వసతుల కల్పనకు కృషి



ఉప్పల్: ఖబ్రస్థాన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ అన్నారు. ఖబ్రస్థాన్‌లో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని పరిశీలించాల్సిందిగా ముస్లిం నేతలు కార్పొరేటర్‌ను కోరారు. దీంతో ఆమె సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి గ్రేవ్‌యార్డును పరిశీలించారు. షెడ్డు నిర్మాణం, రోడ్డు, హైమాస్ట్ లైట్ల ఏర్పాట్లు తదితర వసతులు కల్పించనున్నట్లు వివరించారు. డీఈ వెన్నెల, ఏఈ వినీత్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు బన్నాల ప్రవీణ్ పాల్గొన్నారు.

కీసర రామలింగేశ్వరుడికి విశేష పూజలు





ఆలయ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం అర్చకులు క్షీరాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు నిర్వహించిన స్వామివారి పల్లకి సేవలో ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, దేవాలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి స్థలం కేటాయించాలి..

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద మున్నూరు కాపు సంఘం నిత్యాన్నదాన సత్రం భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని సోమవారం కీసరగుట్ట దేవస్థానం చైర్మన్ తటాకం నారాయణకు సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు మహేందర్‌పటేల్, ప్రధాన కార్యదర్శి పాతంశెట్టి వెంకటేశ్వరరావుపటేల్‌లు మాట్లాడారు. గత 11 ఏళ్లుగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులతో పాటు, అధికారులు, భక్తులకు ప్రతి ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ తటాకం నారాయణ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. మున్నూరుకాపు సంఘం నేతలు రమేష్, మడూరి రవీందర్, లక్ష్మణ్, నరేష్ సుధాకర్, కమలాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.